AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

27-12-2025 (Saturday) MAIN EDITION


## సంక్రాంతికి వారం రోజుల సెలవులు




**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు సంక్రాంతి పండుగ మరింత ఆనందాన్ని తీసుకురానుంది. ప్రభుత్వం తొలుత ప్రకటించిన ఐదు రోజుల సెలవులను సవరిస్తూ, వారం రోజుల పాటు సెలవులు ఇచ్చే దిశగా కసరత్తు చేస్తోంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జనవరి 11 నుంచి 15 వరకు ఐదు రోజులు సంక్రాంతి సెలవులుగా నిర్ణయించారు. అయితే 14న సంక్రాంతి అనుకొని ఆ సెలవులు ప్రకటించారు. కానీ 15న సంక్రాంతి వస్తోంది. దీంతో 16 వరకు సెలవులు ఇవ్వనున్నారు. జనవరి 10న రెండో శనివారం ఉంది. దీంతో జనవరి 10 నుంచి 16 వరకు పాఠశాలకు సెలవు ఉండనుంది.

## శిల్పా శెట్టికి బాంబే హైకోర్టులో భారీ ఊరట



**అక్షరటుడే, సినిమాడెస్క్ :** బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి బాంబే హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. సోషల్ మీడియా వేదికలపై ఆమెకు సంబంధించిన అసభ్యకర మార్ఫింగ్ చిత్రాలు, డీప్‌ఫేక్ వీడియోలను వెంటనే తొలగించాలని న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి కంటెంట్ ఆమె వ్యక్తిగత గోప్యతను, గౌరవాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తోందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అద్వైత్ సేత్నా ఏకసభ్య ధర్మాసనం, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న కంటెంట్‌ను పరిశీలించిన అనంతరం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

## శివాజీ వ్యాఖ్యలపై నాగబాబు స్పందన



**అక్షరటుడే, ఏపీ :** నటుడు శివాజీ ఇటీవల దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్లో చేసిన వ్యాఖ్యలపై ఇంకా విమర్శలు ఆగడం లేదు. నటుడు, ఎమ్మెల్సీ నాగబాబు తాజాగా శివాజీ వ్యాఖ్యలపై స్పందించారు. మోరల్ పోలీసింగ్ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. మగ అహంకారంతో ఆడ పిల్లల వస్త్రధారణపై మాట్లాడుతున్నారని విమర్శించారు. వారిపై అలా మాట్లాడేందుకు ఏం హక్కుందని ప్రశ్నించారు. మగవారితో సమానంగా ఆడపిల్లలను బతకనివ్వాలన్నారు.

## టెట్ హాల్‌టికెట్లు విడుదల



**అక్షరటుడే, హైదరాబాద్:** టెట్ హాల్ టికెట్లను విద్యాశాఖ అధికారులు శనివారం విడుదల చేశారు. జనవరి 3 నుంచి 20 వరకు తొమ్మిది రోజుల పాటు టెట్ పరీక్షలు జరగనున్నాయి. సీబీటీ విధానంలో రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు టెట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## అమెరికాలో భారత సంతతి విద్యార్థి అరెస్టు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కుటుంబసభ్యులపైనే దాడికి పాల్పడిన కేసులో అమెరికాలో భారత సంతతి విద్యార్థిని కొల్లిన్ కౌంటీ పోలీసులు అరెస్టు చేశారు. టెక్సాస్ వర్సిటీలో చదువుతోన్న 22 ఏళ్ల మనోజ్ సాయి తరచూ తమపై బెదిరింపులకు దిగుతూ దాడి చేస్తున్నట్లు అతడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

## డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి సోదరుడు

**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రముఖ నటి సోదరుడు డ్రగ్స్ కేసులో పరారయ్యాడు. మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి సోదరుడు అమన్‌ప్రీత్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. ట్రూప్ బజార్‌కు చెందిన వ్యాపారులు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వి డ్రగ్స్ దందా చేస్తున్నారు. వీరిని పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. వారి అరెస్టుతో అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు అధికారులు గుర్తించారు.

## ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు కమిటీ నివేదిక

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇటీవల వేలాది ఇండిగో విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందే. ఇండిగో విమానాల రద్దుకు దారితీసిన పరిస్థితులపై విచారణకు డిసెంబర్ 5న కమిటీని ఏర్పాటు చేశారు. డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ సంజయ్ కె బ్రహ్మణే నేతృత్వంలోని విచారణ కమిటీ తన నివేదికను శుక్రవారం సాయంత్రం సమర్పించింది. ఇండిగోకు భారీ జరిమానాతోపాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. భవిష్యత్‌లో ఇలాంటి సంక్షోభాలు తలెత్తకుండా కమిటీ సూచనలు చేసినట్లు తెలుస్తోంది.



## తగ్గిన నేరాలు

హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది నేరాలు తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే మొత్తం 15 శాతం క్రైమ్స్ తగ్గినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు 2025 నేర నివేదికను శనివారం ఆయన విడుదల చేశారు. నగరంలో నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను వివరించారు. మైనర్, డ్రంకన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త సంవత్సరం పోలీస్ విజన్‌ను ఆయన ఆవిష్కరించారు.




- 566 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- పిల్లలపై పెరిగిన క్రైమ్స్
- హైదరాబాద్ వార్షిక క్రైం రిపోర్టు విడుదల చేసిన సీపీ సజ్జనార్

నగరంలో ఎక్కడ దొంగతనం జరిగినా పట్టుకుంటారనే భయం దొంగల్లో ఏర్పడిందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. తెలంగాణలోకి ఇతర రాష్ట్రాల నుంచి గ్యాంగ్ లు రావాలంటే భయపడుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది మొత్తం 566 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశామని వివరించారు. మహిళలపై నేరాలు 6శాతం పెరిగినట్లు వెల్లడించారు. 405 అత్యాచారం, 119 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. పోక్సో కేసులు సైతం 27 శాతం పెరిగాయన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు 28 శాతం, సైబర్ నేరాలు 8 శాతం తగ్గినట్లు సీపీ వెల్లడించారు.

### పెరిగిన డ్రగ్స్ కేసులు

రాష్ట్ర రాజధాని నగరంలో డ్రగ్స్ కేసులు గతేడాదితో పోలిస్తే పెరిగాయని సీపీ సజ్జనార్ తెలిపారు. 368 కేసులు నమోదు చేసి, 2,690 మంది నిందితులను అరెస్ట్ చేశామని వివరించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 19,831 కేసులు నమోదయ్యాయని.. కోర్టులో 4,463మందికి శిక్ష పడినట్లు వెల్లడించారు. సెల్‌ఫోన్, మైనర్ డ్రైవింగ్ కేసులు పెరిగాయన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన విషయంలో 1,26,140 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 49,732, మైనర్ డ్రైవింగ్స్ 7,808 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. 2,679 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా.. 294మంది మృతి చెందారని కమిషనర్ తెలిపారు. షీ టీమ్స్‌కు సంబంధించి మొత్తం 1,114 కేసులు పెట్టినట్లు తెలిపారు. 3,817 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. ఆపరేషన్ స్మైల్ కింద 896 మంది పిల్లలను, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో 1,247 మందిని రక్షించినట్లు వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు.

### సైబర్ మోసాలు

నగరంలో మొత్తం 2,286 సైబర్ క్రైమ్ కేసులు నమోదు అయ్యాయని సీపీ తెలిపారు. ఇందులో పెట్టుబడులకు సంబంధించినవి 740, మ్యాట్రిమోని మోసాలు 12, జాబ్ పేరిట 43, ఓటీపీ మోసాలు 458 ఉన్నట్లు వివరించారు. గతేడాది 77 హత్యలు జరగ్గా 2025లో 69 జరిగినట్లు తెలిపారు. హత్యాయత్నం ఘటనలు 214 నుంచి 176కు తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాలు 3,190, చీటింగ్ కేసులు 4,536 నమోదు అయినట్లు వెల్లడించారు.

## జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు



**అక్షరటుడే, హైదరాబాద్ :** జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జర్నలిస్టులను రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కల్పిస్తానని రేవంత్ రెడ్డి చెప్పి, ఈరోజు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా జర్నలిస్టులు ధర్నా చేస్తుంటే అరెస్ట్ చేయడం సరి కాదని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో 26 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. జర్నలిస్టుల కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ కేటాయించామని చెప్పారు. కరోనా సమయంలో విలేకరులను ఆదుకున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 26 వేల నుంచి 10 వేలకు అక్రిడిటేషన్ కార్డులు తగ్గించారన్నారు. డెస్ జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్ కార్డులు లేవంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు తెలుపుతుందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యపై మాట్లాడతామని ఆయన పేర్కొన్నారు.

## ఉప ఎన్నికలు వస్తే గెలుస్తా : దానం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలు వస్తే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం తర్వాత కాంగ్రెస్ గూటికి చేరారు. ఎంపీ ఎన్నికల్లో హస్తం పార్టీ తరఫున సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం స్పీకర్ వద్ద ఆయన అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో ఆయన ఉప ఎన్నికల గురించి మాట్లాడడం గమనార్హం. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు దానం తెలిపారు. శనివారం ఉదయం కార్యకర్తలతో మాట్లాడారు. ఉపఎన్నిక వస్తే మళ్లీ గెలుస్తానని పేర్కొన్నారు. కార్యకర్తల అండతోనే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు చెప్పారు. తాను రాజీనామా చేయడానికి, ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి కార్యకర్తలేనని తన ధైర్యం అన్నారు. దీంతో ఆయన త్వరలో రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతోంది.

## బాక్సింగ్ డే టెస్ట్‌లో ఇంగ్లాండ్ విజయం

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** యాషెస్ సిరీస్‌లో భాగంగా జరిగిన బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు ఘన విజయం సాధించింది. తొలి మూడు టెస్ట్‌ల్లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకుంది. నాలుగో టెస్ట్‌లో ఇంగ్లిష్ జట్టు గెలుపొంది పరువు కాపాడుకుంది. ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే పూర్తి కావడం గమనార్హం. బౌలర్లు నిప్పులు చెరగడంతో ఇరు జట్లు తక్కువ స్కోర్లకే పరిమితం అయ్యాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇంగ్లిష్ జట్టు 110 పరుగులకే కుప్ప కూలింది. రెండో ఇన్నింగ్స్ ఆసీస్ జట్టు 132 పరుగులకు ఆలౌటైంది. 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది.

## కాంట్రాక్టర్లతో హరీశ్‌రావు కుమ్మక్కు: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి మాజీ మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. నాగర్ కర్నూల్‌లో ఆమె మాట్లాడారు. హరీశ్ రావు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి పంప్ హౌస్‌ను అండర్ గ్రౌండ్ పంప్ హౌస్ చేశారన్నారు. దీంతో అది బ్లాస్టింగ్ చేయడంతో 3, 5వ మోటార్లు పని చేయడం లేదని చెప్పారు. హరీశ్ రావు నిర్వాకంతో ప్రస్తుతం 3 మోటార్లే పని చేస్తున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉరుకులు, పరుగులు పెట్టినట్లు పాలమూరు రంగారెడ్డి కూడా పెట్టి ఉంటే ఇవాళ రిజల్ట్ వేరే ఉంటుండే అని ఆమె అన్నారు. కృష్ణా జలాల విషయంలో మహబూబ్ నగర్ జిల్లాకు తెలంగాణ వచ్చాక కూడా అన్యాయమే జరిగిందన్నారు.

## జనవరి 1 నుంచి రైళ్ల వేళల్లో మార్పులు



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా జనవరి 1 నుంచి కొత్త రైల్వే టైమ్ టేబుల్ అమల్లోకి రానుంది. దీంతో రైలు వేళల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకోనున్నాయి. గతంలో జూలై 1 నుంచి రైళ్ల వేళలను మార్చేవారు. ఇప్పుడు జనవరి 1 నుంచి అమలు చేస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా 1,400 రైళ్ల వేళల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకోనున్నాయి. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 80కిపైగా రైళ్ల వేళలు మారనున్నాయి. 3 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు ఈ సమయాలను మార్చినట్లు అధికారులు తెలిపారు. మారిన టైమ్ టేబుల్ వివరాలను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కరీంనగర్ నుంచి కాచిగూడ డెమో ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్ జంక్షన్‌కు జనవరి 1వ తేదీ నుంచి సాయంత్రం 6:50 నిమిషాలకు బదులుగా 6:00 గంటలకు చేరుకుంటుంది. కరీంనగర్ నుంచి బోధన్ 67773 మెము ప్యాసింజర్ రైలు నిజామాబాదు జంక్షన్‌కు సాయంత్రం 7:55 నిమిషాలకు బదులుగా 7:15 నిమిషాలకు చేరుకుంటుంది.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోదీ కన్ను : జగ్గారెడ్డి



**అక్షరటుడే, విజయవాడ:** విశాఖ స్టీల్ ప్లాంట్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో శనివారం ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది ఒక చరిత్రన్నారు. ఇచ్చిన మాట ప్రకారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాంగ్రెస్ జాతికి అంకితం చేసిందని చెప్పారు. అయితే దానిపై మోదీ కన్ను పడిందన్నారు. దీంతో ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే విశాఖ స్టీల్ ను కాపాడుకోవచ్చని తెలిపారు. చంద్రబాబు, వైఎస్ జగన్, పవన్ కల్యాణ్ విశాఖ ప్రజలను, స్టీల్ ప్లాంట్ కార్మికులను మోసం చేశారని విమర్శించారు.

## 'పుష్ప–2 తొక్కిసలాట' ఘటనపై ఛార్జిషీట్

**అక్షరటుడే, హైదరాబాద్ :** పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేశారు. హీరో అల్లు అర్జున్‌పై సైతం అభియోగాలు నమోదు చేశారు. మొత్తం 23 మందిపై ఛార్జి షీట్ వేసిన పోలీసులు ఏ -11గా అల్లు అర్జున్ పేరు చేర్చారు. ఏ 1గా సంధ్య థియేటర్ మేనేజ్మెంట్‌పై కేసు పెట్టారు. బన్నీ మేనేజర్, వ్యక్తిగత సిబ్బందితో సహా 8 మంది బౌన్సర్లపై ఛార్జిషీట్ ఫైల్ చేశారు.

## 'హెచ్1బీ' వీసాలపై ఎంబసీ అడ్వైజరీ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. యూఎస్ ఆంక్షల నేపథ్యంలో హెచ్ 1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండడంపై ఆ దేశ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని పేర్కొంది. అలాంటి వారి హామీలను నమ్మొద్దని సూచించింది. దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని 'ఎక్స్' వేదికగా అడ్వైజరీ జారీ చేసింది.